ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్త విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ : 16.12.2025 సమయం : 13.10 గంటలు

ముఖ్యాంశాలు

1. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము శీతాకాల విడిదికి రేపు రాష్ట్రానికి చేరుకోనున్నారు.

2. రైతుల ఆదాయం రెట్టింపు అయ్యేందుకు వ్యవసాయ శాస్త్రవేత్తలు కృషి చేయాలని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ పిలుపునిచ్చారు.

3. దేశ అభివృద్ధిలో యువతను భాగం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం పలు పథకాలను అమలు చేస్తోందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి పేర్కొన్నారు.

4. రైతులు ఇంటి నుంచే మొబైల్ యాప్ ద్వారా యూరియా బుక్ చేసుకునేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చెప్పారు.

**రాష్ట్రపతి:**

రాష్ట్రపతి ద్రౌపది ముర్ము శీతాకాల విడిదికి రేపు మధ్యాహ్నం రాష్ట్రానికి చేరుకుంటారు. రాష్ట్రపతి రేపటి నుంచి ఈనెల 22 వరకు సికింద్రాబాద్, బొల్లారం లోని రాష్ట్రపతి నిలయంలో విడిది చేస్తారు. వార్షిక శీతాకాల విడిదికి రాష్ట్రపతికి ఘనంగా స్వాగతం పలికేందుకు రాష్ట్ర యంత్రాంగం అన్నీ ఏర్పాట్లు పూర్తి చేసింది. ఈ పర్యటనలో భాగంగా రాష్ట్రపతి పలు కార్యక్రమాల్లో పాల్గొంటారు. పలు రంగాల ప్రముఖులను కలుసుకుంటారు. హైదరాబాద్ సమీపంలోని ఫిలిం సిటీలో ఈ నెల 19 న జరిగే రాష్ట్రాల పబ్లిక్ సర్వీస్ కమిషన్ ల సదస్సును

రాష్ట్రపతి  ప్రారంభిస్తారు. అలాగే , గచ్చిబౌలీ లోని బ్రహ్మ కుమారీస్ సంస్థ ఆడిటోరియమ్ లో ఈనెల 20 న – భారతీయ విజ్ఞానం-శాంతి మార్గాలు, ప్రగతి అనే అంశంపై జరిగే కార్యక్రమంలో రాష్ట్రపతి పాల్గొంటారు. అలాగే, ఈనెల 21 న రాష్ట్రపతి నిలయంలో ఎట్ హోమ్ లో పాల్గొంటారు.

-----MSL

**గవర్నర్**

వ్యవసాయంలో అన్నదాతల ఆదాయం రెట్టింపు అయ్యేందుకు వ్యవసాయ శాస్త్రవేత్తలు కృషి చేయాలని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ పిలుపునిచ్చారు. ఆవిష్కరణలు  , పరిశోధనలు, ప్రయోగ ఫలితాలు క్షేత్రస్థాయిలో రైతులకు అందుబాటులోకి రావాలని సూచించారు. అగ్రి యూనివర్సిటీ ఉపకులపతి అల్దాస్ జానయ్య , రిజిస్ట్రార్ విద్యాసాగర్ , పరీక్షల నియంత్రణాధికారి మల్లారెడ్డి నిన్న లోక్‌భవన్‌లో గవర్నర్‌ను కలిసి వ్యవసాయ వర్సిటీ ప్రగతి నివేదికను అందజేశారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ ... అధిక ఉష్ణోగ్రతలు, భారీ వర్షాలు, కరవు, చీడపీడలను ఎదుర్కొనే విత్తన రకాలను కనిపెట్టాలని సూచించారు.

డెస్క్

**కిషన్ రెడ్డి:**

దేశ అభివృద్ధిలో యువతను భాగం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం పలు పథకాలను అమలు చేస్తోందని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి   G కిషన్ రెడ్డి పేర్కొన్నారు. డిల్లీలో ఈరోజు ఒక కార్యక్రమం సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ...   పాఠశాలల్లో ఫిట్ నెస్ మొదలు  , ఒలింపిక్స్ క్రీడల వరకు యువతను సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. మేకిన్ ఇండియా కార్యక్రమంలో భాగంగా క్రీడా పరికరాల తయారీని ప్రోత్సహిస్తున్నట్లు  , వివిధ అంతర్జాతీయ క్రీడల్లో పతకాల సంఖ్య పెరిగేలా క్రీడాకారులను తీర్చి దిద్దటం , వారికి ఆర్థిక సాయం పెంచటం లాంటి పలు కార్యక్రమాలను అమలు చేస్తున్నట్లు వివరించారు. 2036లో ఒలింపిక్స్ క్రీడలు దేశంలో నిర్వహించేందుకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ కృషి చేస్తున్నారన్నారు. సంప్రదాయ

క్రీడలకు కూడా ప్రోత్సాహం అందిస్తున్నట్లు, 792 జిల్లాల్లో ఖేలో ఇండియా కార్యక్రమాల ద్వారా, ఇంకా అథ్లెట్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ ద్వారా శిక్షణ అందిస్తున్నట్లు చెప్పారు.

**(Sound byte - కిషన్ రెడ్డి)**

**-------MSL**

**తుమ్మల**

రైతులు ఇంటి  నుంచే మొబైల్ యాప్ ద్వారా యూరియా బుక్ చేసుకునేలా రాష్ట్ర ప్రభుత్వం వినూత్న నిర్ణయం తీసుకుంది. ఈనెల 20వ తేదీ    నుంచి ప్రయోగాత్మకంగా దీనిని అమలు చేయనుంది.  యూరియా కోసం ప్రతి సీజన్ లో రైతులకు ఎదువుతున్న ఇబ్బందుల నేపథ్యంలో వ్యవసాయశాఖ ప్రత్యేక మొబైల్ యాప్‌ను రూపొందించింది. ఇందులో యూరియా నిల్వల సమాచారం అప్ డేట్ చేస్తారు.  రైతులకు సమయం ఆదాతో పాటు యూరియా, ఇతర ఎరువుల పంపిణీని సరళతరం చేయడానికి ఈ విధానం తీసుకొచ్చామని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు చెప్పారు. దీని ద్వారా ఎరువుల పక్కదారి పట్టకుండా , పంట పండించే రైతులకు మాత్రమే అందుతాయన్నారు. అధికారులు యాప్ గురించి రైతులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని ఆదేశించారు.

జీఎస్

**శ్రీధర్ బాబు**

భారతీయ సినీ సంగీత చరిత్రపై చెరగని సంతకం    'ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం' అని రాష్ట్ర ఐటీ , పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు  అన్నారు.  14 భాషల్లో... 40వేలకు పైగా పాటలు పాడి, పాటకు ఎల్లలు లేవని నిరూపించిన స్వర మాంత్రికుడు అని కొనియాడారు. హైదరాబాద్ లోని రవీంద్రభారతిలో ఏర్పాటు చేసిన ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం విగ్రహాన్ని మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్య నాయుడితో కలిసి నిన్న లాంఛనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ...  తరాలు మారినా , ఆయన పాట నిత్యనూతనంగా ప్రతీ తెలుగు

హృదయాన్ని తట్టి లేపుతూనే ఉంటుందన్నారు. కళలను ప్రోత్సహించేందుకు , కళాకారులను గౌరవించేందుకు తమ ప్రభుత్వం ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందన్నారు.

జీఎస్

**ఆర్పీఎఫ్**

రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ 26వ ఆల్ ఇండియా పోలీస్ బ్యాండ్ పోటీలు ఈరోజు నుంచి 20వ తేదీ వరకు సికింద్రాబాద్ మౌలాలి , ఆర్పీఎఫ్ శిక్షణా కేంద్రంలో నిర్వహిస్తున్నట్లు ఆర్పీఎఫ్ డీఐజీ , నోడల్ అధికారి షాదాన్ జెబ్ ఖాన్ ఒక ప్రకటనలో తెలియజేశారు. జాతీయ స్థాయిలో జరిగే ఈ ప్రతిష్టాత్మక ఈవెంట్ లో వివిధ రాష్ట్రాల పోలీసు విభాగాలు, కేంద్ర సాయుధ పోలీసు దళాలకు చెందిన దాదాపు 1 ,300 మంది సిబ్బందితో కూడిన 24 పోలీస్ బ్యాండ్ బృందాలు పాల్గొంటాయని వివరించారు. ఈ పోటీల్లో భాగంగా ఈనెల 17వ తేదీ సాయంత్రం చార్మినార్ దగ్గర, 18వ తేదీ సాయంత్రం నెక్లెస్ రోడ్ లోని అంబేద్కర్ విగ్రహం దగ్గర ప్రదర్శనలు జరుగుతాయన్నారు. ఆల్ ఇండియా పోలీస్ బ్యాండ్ పోటీ గురించి ప్రజలకు అవగాహన కల్పించడం, పోలీస్ బ్యాండ్ల సంగీత నైపుణ్యం , క్రమశిక్షణ, నైపుణ్యాన్ని బహిరంగంగా ప్రదర్శించడమే లక్ష్యంగా ఈ ప్రదర్శనలు నిర్వహిస్తున్నట్లు నోడల్ అధికారి వెల్లడించారు.

పీఎన్

**హైకోర్టు**

వికారాబాద్ దామగుండంలో భారత నావికాదళానికి చెందిన రాడార్ కేంద్రం ప్రాజెక్టుకు సంబంధించి అన్ని చట్ట నిబంధనల అమలుకు సంబంధించిన నివేదికను సమర్పించాలంటూ కేంద్ర ప్రభుత్వాన్ని నిన్న హైకోర్టు ఆదేశించింది. ఈ ప్రాజెక్టు కారణంగా అటవీ ప్రాంతానికి జరిగిన నష్టానికి పరిహారంగా చేపట్టిన ప్రత్యామ్నాయ అటవీ పెంపకం వివరాలను సమర్పించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశిస్తూ విచారణను వచ్చేనెలకు వాయిదా వేసింది.

రాడార్ కేంద్రం నిమిత్తం 2 వేల 900 ఎకరాల అటవీ ప్రాంతాన్ని రాష్ట్ర ప్రభుత్వం కేటాయించడాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్ పై న్యాయస్థానం విచారణ జరిపింది.

డెస్క్

**సీతక్క**

మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని కనుమరుగు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నం చేస్తోందని రాష్ట్ర పంచాయతీరాజ్ , గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క విమర్శించారు. దీని కోసమే పథకం పేరు , అమలు విధానంలోనూ మార్పులు చేస్తోందని ఆరోపించారు. సచివాలయంలో నిన్న సీతక్క మీడియాతో మాట్లాడుతూ... చట్టం ప్రకారం ప్రతి గ్రామీణ పేద కుటుంబానికి వంద రోజుల ఉపాధి కల్పించాల్సి ఉన్నప్పటికీ , ఎన్డీయే ప్రభుత్వం కేంద్రంలోకి వచ్చాక 42 రోజుల కన్నా ఎక్కువ పనిదినాలు కల్పించలేదన్నారు.

డెస్క్

**పొంగులేటి**

హౌసింగ్ బోర్డు గతంలో కేటాయించిన ఇళ్లకు పక్కనే వంద గజాల్లోపు స్థలాలు ఉంటే విక్రయించాలని రాష్ట్ర రెవెన్యూ , గృహ నిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. సచివాలయంలో నిన్న హౌసింగ్ బోర్డు అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. హౌసింగ్ బోర్డు భూముల లీజు , అగ్రిమెంట్లు, కోర్టు కేసులు , అద్దెలు తదితర వాటిపై చర్చించారు. నిజాం కాలం నుంచి 115 సంస్థలకు హౌసింగ్ బోర్డు భూములను లీజుకిచ్చారని, ఇందులో సంస్థలు , ఇళ్లు, విద్యాలయాలు, దేవాలయాలు, వ్యాపార, వాణిజ్య సముదాయాలు ఉన్నాయని, లీజు అగ్రిమెంట్ పునరుద్ధరణ చేసుకోని సంస్థలకు లేఖలు రాసి వారు క్రమబద్ధీకరించుకునేలా చూడాలని మంత్రి పొంగులేటి సూచించారు.

పీఎన్

**టిమ్స్**

వచ్చే ఏడాది మార్చి నాటికి టిమ్స్ ఆసుపత్రి భవన నిర్మాణ పనులను పూర్తి చేయాలని ఆర్ అండ్ బీ శాఖ అధికారులను రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్‌రాజ్ ఆదేశించారు. హైదరాబాద్‌లోని అల్వాల్‌లో నిర్మిస్తున్న టిమ్స్ భవన నిర్మాణ పనులను ఆయన నిన్న పరిశీలించారు. ప్రభుత్వం టిమ్స్ ఆసుపత్రుల భవన నిర్మాణాలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుందని, అల్వాల్‌లో సుమారు 1,196 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో టిమ్స్ ఆసుపత్రిని ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ఈ పనులపై ముఖ్యమంత్రి, రోడ్లు-భవనాల శాఖ మంత్రి ఎప్పటికప్పుడూ పర్యవేక్షణ చేస్తున్నారని అన్నారు.

డెస్క్